




## నెలనెలా సందేహాల సందోహాలు

### చరిత్రలో ప్రపంచ నాయకుల స్థానం

గత కొద్ది మాసాలుగా టెలివిజన్‌లో ఏ చానెల్ పెట్టినా, లేక ఏ వార్తా పత్రిక తిరగేసినా హిల్లరీ, ఒబామా గురించి తప్ప మరే విషయం కనపడడం లేదు. కానీ అప్పుడప్పుడూ నాకనిపిస్తుంది, మరో నాయకుణ్ణి లేదా నాయకురాల్ని ఎన్నుకోబోయే ముందు, గత ఎనిమిదేళ్ళుగా ప్రపంచంలో ఏకైక అగ్రరాజ్యాన్ని పరిపాలించిన నాయకుణ్ణి, అతని అనుచరుల్నీ, వాళ్ళ రాజకీయాల్ని నిశితంగా పరిశీలించ వలసిన అవసరం మనకు లేదా అని? మానవ సమాజం పరిపూర్ణంగా విజయవంతమైన పరిపాలనా విధానాన్ని ఇంకా కనిపెట్టలేకపోయింది. ప్రజాస్వామ్యం మాత్రమే కొంత ఆటుపోట్లను తట్టుకొని నిలబడ గలుగుతోంది. మరి అలాంటప్పుడు మన అనుభవాల్నుంచి నేర్చుకోవాల్సిన అవసరం మనకు చాలా ఉంది. ఇలాంటి సమాజ పరమైన బాధ్యత జర్నలిస్టులకీ, పత్రికలకీ లేదంటారా?

ఈ దేశంలో మీడియా గురించి మనకు తెలీదేముంది? ప్రజలకి ఆ నిముషంలో దేని గురించి ఆలోచించాలో, ఎలా, ఏమని ఆలోచించాలో కూడా చెప్పే హక్కు తమకుందని భావించే వీళ్ళ గురించి పెద్ద చెప్పుకోవలసినదేం లేదు. కాని ఒక్క విషయం మాత్రం నాకు చాలా ఆశ్చర్యంగా ఉంటుంది, అది మన జ్ఞాపకాలు ఎంత తొందరగా మందగిస్తాయో అన్నది. ఉదాహరణకు ఇరాక్ విషయమే తీసుకుందాం. ఈ ఎన్నికల ప్రచారం ముందు కొంతలో కొంత నిజమైన వార్తలు ఇరాక్ నుంచి రాసాగాయి, వాటి గురించి చాలామంది అమెరికన్ ప్రజలు స్పందించి కొన్ని మార్పులు తేవాలన్న పట్టు పట్టారు. కొద్ది నెలల్లోనే ఆ విషయం ఎంతగా మరుగున పడిపోయిందంటే, ఇప్పుడు ఇరాక్ అన్న దేశమొకటుందని, అక్కడ యుద్ధమింకా కొనసాగుతూనే ఉందని పనిగట్టుకొని గుర్తు చేసుకోవాలసి వస్తుంది. మరి అలాంటప్పుడు ఈ పత్రికల వాళ్ళమీదా, టీ.వీ స్టేషన్ల మీద ఆధారపడక బాధ్యత గలిగిన పౌరులుగా దిగిపోతున్న నాయకులను వారిని పరీక్షించటం మనమీదే ఉంది.

సహజంగానే చరిత్ర దయగలిగింది అనడంలో పెద్ద అతిశయోక్తి లేదని మీరూ ఒప్పుకొంటారు. ఉదాహరణకి బిల్ క్లింటన్ విషయమే తీసుకొందాం. అమెరికా గతకొద్ది దశాబ్దాల తర్వాత ఎన్నుకొన్న సమర్ధవంతమైన నాయకుడిగా అతన్ని పరిగణిస్తారు. కానీ అతని రాజకీయ వైఫల్యాలు ఎంతమందికి గుర్తు ఉన్నాయి? దేశ ఆర్థిక పరిస్తితి , దాని అభివృద్ధి మాత్రమే మనందరికీ గుర్తుంది. కానీ పది లక్షల రువాండా ప్రాణాలు అతని చేతుల మీదుగా పోయాయే? ఒక నేరం చేయడం ఎంత దారుణమో, ఆ నేరాన్ని ఆపగలిగే పరిస్థితిలో

ఉండికూడా చూస్తూ ఊరుకోవడమూ అంతే దారుణం కాదా? మొగదీషులో జరిగిన సంఘటనలో అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోవటం ఈ నిర్ణయానికి కారణం అని అతను తనని సమర్థించుకొంటాడు తన పుస్తకంలో. కానీ హ్యూమన్ రైట్స్ రిపోర్ట్‌లో రాసి ఉంది. అతను ఈ విషయం గురించి ఆలోచిస్తున్నప్పుడు అడిగిన ప్రశ్న ఇదట : "ఈ విషయం గురించి మన బ్లాక్ సెనేటర్స్ ఏం అంటున్నారు?". అంటే ఈ విషయం కేవలం పాపులారిటీ క్యాంపైన్ గానే భావించాడన్నది నిజం. ఈ విషయం మనలో ఎంతమందికి తెలుసు? తెలిసీ అతన్ని ఇంకా ఆరాధిస్తున్నామా? మరి అలాగే బుష్, అతని అనుచరులు ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో మరణాలకే కాక దర్ఫూర్ మరణాలకూ కారకులే. అసలు ప్రశ్న ఏంటంటే మరో పది సంవత్సరాల తర్వాత కూడా ఇలాగే అనుకుంటామా లేక బుష్ గురించీ ఇలాగే పోల్చుకొని మంచివాడని తృప్తి పడతామా? నాకు మాత్రం బుష్ చరిత్రలో ప్రపంచంలో చాలా దేశాల్లో దరిద్రాన్ని, ఆకలి చావుల్నీ పెంచిన నాయకుడిగా మిగిలిపోవాలన్న వాదన న్యాయంగా అనిపిస్తుంది. మరి మీ అందరు కూడా వీళ్ళని దగ్గరగా పరిశీలించి వాళ్ళ చేతలకి వాళ్ళని బాధ్యులుగా గుర్తుంచుకుంటారని నా నమ్మకం.